**రామవరపు వేణుగోపాలరావు**

# దొంగ

మద్రాసు నుంచి కలకత్తాపోయే మెయిలు వాల్టేర్ ప్లాట్‌ఫాంమీద నిలబడివుంది. ఆ చిన్న కంపార్టుమెంటులో దాదాపు ముప్ఫయ్ మంది వున్నారు. అందులో నేనొకడిని. మూడు బెంచీలమీదా ఇంతమంది వున్నాం. నేను కూర్చున్న బెంచీమీద నాకు ఇటు అయిదుగురూ అటు ఆరుగురూ వున్నారు. మహాతొక్కిడిగా వుంది. బ్రహ్మాండమైన వుక్క. అటు వాళ్లూ ఇటువాళ్లూ నన్ను ముద్ద చేసేస్తున్నారు అంతా భరిస్తూ సిగరెట్టు కాల్చుకునేదారి ఏదా అని ఆలోచించసాగాను ఇంతలో గంట కొట్టారు. ఇంజను ఒక్కసారి గాండ్రించింది కదలబోయేలోగా ఓ మహానుభావుడు మా కంపార్టుమెంటులోకి ఎక్కేడు, అతని ఆకారం చూశాక నా గుండెల్లో రాయిపడింది. అతను చిన్న ఏనుగు గున్నలా వున్నాడు. ఆకారానికి తగిన పెద్ద పెట్టె వెంట వుంది పోర్టర్‌కి డబ్బులిచ్చి వుస్సురన్నాడు. ఆ తర్వాత చిన్న చిన్న కళ్లతో ఖాళీజాగా ఎక్కడుందా అని చుట్టూ చూశాడు.

"బాబూ, ఎవరైనా నాక్కాస్త చోటు యిప్పిస్తారా?" అన్నాడు.

అంతలావు బొజ్జకి కాస్త జాగా సరిపోతుందా అనుకున్నాను. ఎవరూ మాట్లాడలేదు. ఏమనుకున్నాడో ఏమో తిన్నగా నా దగ్గిరికి వచ్చి "మాస్టారూ, మీరు కాస్త అటు జరగండి...కూర్చోగల్నేమో చూస్తా" అంటూ-నేనింకా జరక్కముందే ఠకాల్న కూర్చున్నాడు. నా చెయ్యి తిమ్మిరి పట్టినట్టు అయింది. నావేపు బాధపడుతున్నట్టు చూశాడు. ఏడుపు మొహంతో "ఫర్వాలేదు" అన్నాను.

బండి కదిలింది. స్తంభించినగాలి కలకలలాడింది ముఖానికి పట్టిన స్వేదం ఆవిరి అయిపోసాగింది.

నా పక్కని కూర్చున్న పెద్దమనిషి నావేపు తిరిగాడు "మాస్టారూ, ఎందాకా?" అన్నాడు.

"కలకత్తా"

"బిజినెస్సా?"

"అవును." అన్నాను.

"ఏం కలకత్తా బాబూ. మాయదారి కలకత్తా. నేన్నాలుగు సార్లెళ్లేను." అన్నాడు నేనేంవీ అడక్కముందే

"వూఁ" అన్నాను.

"ప్రయాణమంటే నాకు మాచెడ్డ భయం. తొందర. ప్రాణం ఆవురావురుమంటుంది. అందులోనీ నాది కొంచెం మహాకాయం..."

మళ్లీ "వూఁ" అన్నాను. ఇలాంటి మనుషులు నాకు చాలామంది తెలుసు ఇలా వాక్చాతుర్యాన్ని, లేదా వాగుడుతనాన్ని, ఉపయోగించి మా బంధువొకాయన పెళ్లి సంబంధం కుదుర్చుకున్నాడు. మరో ఫ్రెండ్ రాజులాంటి ఉద్యోగం కొట్టేశాడు

"బాబూ, పొగ తాగొచ్చా?" అన్నాడా పెద్దమనిషి నన్ను చూసి.

కంపార్టుమెంటు క్రిక్కిరిసివుంది. కాళ్ళకింద తలపైనా మనుషులే. ఎవరిమీద నుసి రాలినా శాపనార్థాలు తప్పవు. ఆ పెద్దమనిషి నా జవాబు వినకుండానే చుట్టకోసం కాబోలు జేబులో చెయ్యిపెట్టేడు. వెంటనే తేలుకుట్టినట్టు "అయ్యబాబోయ్" అని లేచి నిలబడ్డాడు

"ఏమైంది...ఏమైంది!!" అని ఆ రైదు కంఠాలు ఏక కంఠంగా ప్రశ్నించాయి

చెమట్లు కక్కుతూ "పర్సుపోయింది" అన్నాడు ఆ మాటలంటూనే కంపార్టుమెంటు ప్రవేశద్వారం వేపు చూశాడు. అక్కడ నలుగురైదుగురు మనుషులు ఆముదం తాగిన ముఖాలు పెట్టుకుని నిలబడివున్నారు.

"బండి యెక్కేముందు చూసుకుంటే జేబులో వుంది బాబూ ఇంతలోనే ఎవడో కొట్టేశాడు..." అని బూతులు ప్రారంభించాడు

"పర్సులో ఎంతుందేమిటి?" అన్నాను

"లెక్కమీద వెయ్యిరూపాయిల పై చిలుకు బాబూ. విజినారం ఎళ్ళి సరుకు కొందామని తెచ్చను..." అంటూ మొర్రోమన్నాడు.

నాకు జాలేసింది

"పోలీసు రిపోర్టివ్వండి." అన్నారెవరో.

"ఎందుకు బాబో, పీకులాట ఆ డబ్బు ఎక్కడిదని అడుగుతారు. చెప్పలేక చావాలి..." అన్నాడు.

దాన్నిబట్టి అది నల్లధనం అని గ్రహించాను. డబ్బు పోయిందన్న బాధతో అతనిముఖం వాడిపోయింది మనిషి డీలాపడిపోయేడు.

కంపార్టుమెంటులో యెన్నో వ్యాఖ్యానాలు బయలుదేరాయి. యెవరో జేబుదొంగలగురించి కథలు చెప్పడం ప్రారంభించారు. నాపక్క కూర్చున్న పెద్దమనిషి కళ్లల్లో వెయ్యి అనుమానాలు కదుల్తోంటే అందర్నీ విచిత్రంగా చూస్తున్నాడు. ఈ ముప్ఫయిమందిలోనే వున్నాడా దొంగ!

పాపం అనుకున్నాను ఇంతలో విజయనగరం వచ్చింది. ఆ పెద్దమనిషి దిగిపోతూ నన్ను చూసి వెళ్తాను బాబూ మీరైనా జాగ్రత్తగా వుండండి. కలికాలం గతి మీకు తెలుసుగా! అన్నాడు. "అలాగే" అని తలూపాను.

కాసేపు గడిచింది. కంపార్టుమెంటులో మిగతా జనాభా ఇంకా దొంగతనాలగూర్చి చెప్పుకుంటూనే వున్నారు. నేను లేచాను. దారి చేసుకుని లావెటరీలోకి వెళ్లాను. తలుపు గడియపెట్టి జేబులోంచి పర్సు తీశాను. ఆ పెద్దమనిషి చెప్పినట్లు వెయ్యిరూపాయలూ లక్షణంగా వున్నాయి, అద్దంలోకి చూసి విజయగర్వంతో నవ్వేను ఆ పెద్దమనిషి బ్లాక్ మార్కెట్లో వెయ్యిరూపాయిలు దొంగతనంగా సంపాదించేడు నేను అతనికి తెలీకుండా అతని జేబులో పర్సు కొట్టేశాను.

మా యిద్దర్లో యెవరు చెప్మా పెద్ద దొంగ —?

దొంగ స్వగతంలోకి పరకాయ ప్రవేశంచేస్తే కథ చెప్పే తీరులో వైవిధ్యం కనబడుతుందేమో ననే ఆలోచన రావడంవల్ల యిలా రాయాల్సి వచ్చింది కాని, నిజంగా నేను దొంగను కాను కేవలం ఒక రచయితను మాత్రమే।